# కైవల్య నవనీతము

బ్రహ్మ ముహూర్తంలో ముముక్షువులందరికి మెలుకువ వచ్చింది. ఏకాదశి కాకపోయినా గత రాత్రి అంతా నిద్దురపోని - రామచంద్రయ్యకు మనస్సు మల్లె కన్నా తేలిక అయింది.

ఆ చల్లటి వేళలో త్యాగరాజుగారి పాట గుర్తుకు వచ్చింది. 'బ్రోవ భారమా-నన్ను బ్రోవ భారమా' పల్లవి దాటి చరణం వైపు సాగిపోతుంటే, బమ్మెర పోతన్నగారు వచ్చారు. శ్రీ కైవల్య పదంబు చేరుటకు వైచింతించెదన్. ఈ నిశ్శబ్దంలోంచి శబ్దం పుట్టుకొచ్చింది. పక్కయింటి పిల్లి దొంగచాటుగా పెరుగుతినే ప్రయత్నంలో భాండాన్ని భగ్నం చేసింది.

ప్రపంచకమంతా ఆదమరిచి నిదురపోతుండె. తనుమాత్రం మేల్కొని ఉన్నాడు - మహా జ్ఞానిలా.

తూరుపు తెల తెలవారుతూ వుంటే కాలగర్భంలోంచి మరొక్క పద్మం వికసించింది.

కాలం తీరిన కలువలు కళ్ళు మూసుకున్నాయి. అందరికి అమృతం పంచి యిచ్చిన వెన్నెల రాజు కనుచాటు అయ్యాడు.

ఎందుకనో యీనాడు చిత్రాసనం మీద కూర్చుంటె చిత్తం స్థిరం కావడం లేదు.

గాయత్రి ముందుకు సాగడం లేదు.

'ఉత్తిష్ఠంతు భూత పిశాచాః యే తే భూమి భారకాః ....'

ఈ మాటె మనస్సు మళ్ళీ మళ్ళీ వల్లె వేస్తోంది.

"భూమి భారకాః"

కన్ను జపమాల మీద నిలచింది.

తన పర్ణశాల లోంచి తన బయట ప్రపంచకాన్ని చూశాడు.

అధునాతనమైన భవనం. రంగు రంగుల పుష్పాలు, వరండాలో ఖరీదైన విదేశీ వాహనాలు.

ఎక్కడి మానుష జన్మం, ఎత్తిన ఫలమే మున్నది...

నిక్కము నిన్నె నమ్మతి నీ చిత్తించికను...

అన్నమాచార్యులవారి మాటకు అడ్డం వస్తూ - ఒక చిన్నారి కంఠం కోయిలలు కూయించింది.

"పీడ విరగడవటం అంటె ఏమిటి?" అని అడిగింది.

ఆ అమాయికురాలి వంక చూస్తుంటె - రామచంద్రయ్యగారికి అంతులేని ఆనందం కలిగింది. అంతలోనే గుండెల్లో గుబులు గూడు కట్టుకుంది.

"శివ గంగా నగర నివాసిని

శ్రీ రాజ రాజేశ్వరీ..." అంటూంటె

"నేనేదో అడుగుతూవుంటె నువ్వు పాటలు పాడతావేం?" అంటూ ఆ చిన్నారి కంఠం గద్దించింది.

ఆపుకోలేనంత నవ్వు వచ్చింది.

'ఇంత చిన్నపిల్లకు అంత పెద్ద ప్రశ్న ఎందుకా' అని ఆలోచన వచ్చింది. "నువ్వెప్పుడూ ఇంతే. నేనేదైనా అడిగితే - పెద్దగా నవ్వుతావు. లేకపోతే పిచ్చివాడిలాగా పాటలు పాడుతాయి. ఇల్లా అయితే నీతో మాట్లాడను."

"కూర్చో అరవింద. పూజలో వున్నా కదా. అందుకని నీ ప్రశ్న సరిగ్గా అర్థం కాలేదు. మళ్ళీ యింకొక్కసారి అడుగు. తెలుస్తే చెబుతాను."

"అంత పెద్ద ముసలివాడివి. ఇంత చిన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేవా?'

తాతగారు నవ్వుకున్నారు.

"తీరికగా కోపపడుదువుగాని. ముందు నీ ప్రశ్న ఏమిటో అడుగు."

"ఈ ముసలి పీడ విరగడయిపోతేగాని ఈ కొంపకు పట్టిన శని వదలదు అని అమ్మ నాన్నతో అంటోంది. అంటె అర్థం ఏమిటి?" అని అడిగింది.

రామచంద్రయ్యగారు, "వట్టి గొడ్డు భక్షించి తిరిగితి

పుట్టు లోభులనెల్ల పొట్టలై పొగిడితి..."

అని రాగయుక్తంగా అంటూంటె అరవింద వదనం అరుణమైయింది.

"ఇదుగో మళ్ళీ పాడుతున్నావు" అంటూ మందలించింది.

"పాట పాడనులే."

"అయితే అర్థం చెప్పు..."

"పీడ అంటె బాధ. విరగడయిపోవటం అంటె - బాధ పోయి సుఖంగా వుండటం అన్నమాట - కొంప అంటె సుఖం ఇచ్చు యిల్లు - శని అంటె నెమ్మదిగా, ఆలస్యంగా పనులు చేయించే గ్రహం. అంటే ఈ బాధ తొలగిపోతేనే కాని- మన యింట్లో పనులు చురుకుగా సాగవు. అప్పుడు కాని మనకు సుఖం లభించదు అని అర్థం."

"ముసలి పీడ అంటె?"

"కొన్ని పీడలు - చిన్న పిల్లలులాగా చలాకిగా వుంటాయి. ఎక్కడా కూడా నిలవ్వు. మరికొన్ని పీడలు - పెద్దవాళ్ళలా వాళ్ళు అనుకున్న పనులు పూర్తిచేసుకునే దాకా వుండి తరువాత సమసిపోతాయి. కొన్ని పీడలు - ఓపిక లేక ఏ పని చెయ్యలేక పోదామన్నా - పోకుండా పట్టుకు వేళ్ళాడుతూ వుంటాయి. వాటినే ముసలి పీడ అంటారు."

"ఎంత బాగా చెప్పావు తాతయ్యా! నువ్వు మా స్కూల్లో టీచరు కంటే బాగా చెప్పావు. నువ్వు మా బళ్ళో పనిచేయకూడదూ? నేను మా మేడమ్‌గారితో చెపుతాను. చక్కగా యూ కేజి పిల్లలకి చెపుదువుకాని..."

"మా బంగారు తల్లికి నేనంటే ఎంత ప్రేమో..." అని ఆ ముసలి మనస్సు మురిసిపోతుంటే...

ప్రక్క ఇంట్లోంచి సింహగర్జన వినిపించింది.

"ఎంతసేపు అక్కడ ఏడుస్తావు. ఇంట్లోకి వచ్చి తగలడు."

"అమ్మ పిలుస్తోంది..." అంటూ గజ్జెలపాదాలు మేడవైపు పరుగెత్తాయి. కూని రాగం చేరువైంది. సెగలు కక్కుతున్న కాఫీ కప్పు కళ్ళ ఎదుట కనిపించింది.

'తాతయ్యా' అంటూ ఒక మగ కంఠం పలిచింది.

చూపు అటు సాగింది. ఆ ఎదుట నిలచిన చిన్నవాడి చూపులో చిలిపి తనం కనిపించింది.

"గుడ్‌మార్నింగ్ తాతయ్యా..."

"గుడ్‌మార్నింగ్ యంగ్‌మాన్..."

"అమ్మకి తెలుగు రాదు. అన్నీ తప్పులే మాట్లాడుతోంది."

"రామం మీ అమ్మకు తెలుగు రాకపోవడ మేమిటి?" ఆవిడ ఎమ్. ఎ. చేసింది కదా!"

"పీనుగులు ఎక్కడైనా కాఫీ త్రాగుతాయా?"

"అదికాదు బాబు..."

"అసలు పీనుగంటేనే చచ్చిపోయిన మనిషి కదా. అటువంటప్పుడు చచ్చు పీనుగ అనే మాటకి అర్థం ఏమిటి? పీనుగుల్లో కూడా చచ్చినవి, బ్రతికినవి కూడా వుంటాయా? వుంటే అవి కాఫీ త్రాగుతాయా?... చెప్పు తాతయ్యా. ఎప్పుడూ బోలెడన్ని పుస్తకాలు చదువుతూ వుంటావుగా?"

మనుమడి ఆ నిశితమైన ఆలోచనకి, ఆ జిజ్ఞాసకి - ఆ సత్యాన్వేషణకి... తాతగారి మనస్సులో హిమాలయమంత గర్వం - పొగమంచంత వాత్సల్యం ఒక్కసారే... కలిగాయి...

"భేషుగ్గా తాగుతాయి. రెండు పూట్ల భోజనం చేస్తాయి. అడప దడపా టిఫిన్లు కూడా తింటాయి."

"తాతయ్యా! నేను సీరియస్‌గా అడుగుతూ వుంటె నువ్వు వేళాకోళం చేస్తున్నావు."

"లేదురా అబ్బి! సీరియస్‌గానే చెబుతున్నాను. ఏదైనా విషయం గురించి తెలుసుకోవాలంటె - మూడు ఆధారాలు వుంటాయి. ప్రత్యక్ష ప్రమాణం - అనుమానం - సంకేతం. పీనుగులు కాఫీ తాగుతాయా అని కాదు నువ్వడిగింది. నువ్వు చూస్తూవుండగానే నీ ఎదురుగుండానే కప్పు ఖాళీ అయిందిగా..."

మనుమడికి కోపం వచ్చింది.

"నీతో వచ్చిన చిక్కే ఇది. ఏదో అడిగితే ఏదో చెబుతావు. నాకేం అర్థం కావటం లేదు. ఇల్లా మాట్లాడటాన్ని ఏమంటారు?"

"ఛాందసమంటారు...."

"బ్రతికున్నవాళ్ళే తినేది త్రాగేది. పీనుగులు కాఫీ తాగవు. నాకు ఆ మాత్రం తెలుసు."

"కాదు బాసు. నలుగురికి సహాయపడే వాళ్ళే బ్రతికున్నవాళ్ళు... ఎవరికీ ఏపని చేసిపెట్టనివాళ్ళు ఎవ్వరికి అక్కర్లేనివాళ్ళు, పీనుగులు"

"నిన్ను ఎవ్వరూ బాగు చెయ్యలేరు తాతయ్యా!"

"థాంక్యూ..." అంటూ తాతయ్య పెద్ద పెట్టున నవ్వాడు.

ఎప్పుడో చాలా వసంతాల క్రితం కంచి పట్టుచీరె బదులు గద్వాల్ చీరె కొన్నందుకు ఆ యిల్లాలు కూడా ఇదే మాట అంది.

అంతేకాదు ఇంకొక మాట కూడా అంది.

"ఈ మనిషితో నేను కాపురం చెయ్యలేను."

ఆనాడు ఆ మాట సరాగం క్రింద కొట్టి పారవేశాడు.

"నువ్వు కాపురం చెయ్యలేకపోతే నేను చేస్తానులే" అని చిలిపిగా అంటూంటె-

"మయస్సు ముంచుకొస్తున్నా చిన్నతనం పోతేదు" అని అంది.

తమ బ్రతుకులకి గ్రహణం పట్టిన రోజున ఆవిడ వేసిన ప్రశ్న - "నేను లేకుండా ఎల్లా బ్రతుకుతారండి?"

"ఇది కూడా బ్రతుకేనా?"

"అయ్యా యీ మణుగురాళ్లు మొయ్యలేక నా ప్రాణం కడగట్టి పోతోంది. సుబ్బి పెళ్ళి వెంకి చావుకి వచ్చినట్టు, మీ చదువు నాకు చచ్చే చావుగా వుంది. అయినా నాకు తెలియక అడుగుతాను - యీ వయస్సులో యీ చదువులు ఎవరిని ఉద్ధరించడానికి?" ఈ సుదీర్ఘ ఉపన్యాసం వింటూ ఆయన చిరునవ్వు నవ్వుతూనే వున్నాడు.

తన సరసన కూర్చోమని సైగ చేసాడు... గడ్డిపోచకి బట్టలు తొడిగి నట్టున్న పోస్టుమ్యాన్ - ప్రక్కనే చతికిలబడ్డాడు.

"తొందరగా సంతకం పెట్టండి - అవతల చచ్చేటంత పని ఉంది."

రామచంద్రయ్యగారు కాగితంలో రెండు వస్తువులు తీసుకువచ్చి అతని చేతికి యిస్తూ "తిను..." అన్నారు.

"ఇదెక్కడ గోలండి! పైన బారెడు ప్రొద్దు ఎక్కింది... సంతకం పెట్టి ఆ కాగితం నా మొహాన్న కొడితే - పోయేనాటికి."

"ఈ అరిశలు - యీ మినపసున్ని ఉండలు దేనికండి?"

ఆయన గ్లాసుతో మంచి నీళ్ళు అతని ముందు పెడుతూ "రవ్వంత మిగల్చకుండా తిను - చల్లటి మంచినీళ్ళు తాగు. అప్పుడు ఆలోచిద్దాం - కాగితం- సంతకం సంగతి."

"మీరు నన్ను మరీ మొహమాటం పెడుతున్నారు..."

"మారు వడ్డించనులే. ఖంగారు పడకు."

"ఇప్పుడు యీ మిఠాయిలు, ఇవన్నీ ఎందుకండి?"

"అగ్నికి నైవేద్యం."

"అగ్నికి నైవేద్యం ఏమిటండి?"

"నేను చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్న అగ్ని పురాణం తెచ్చిపెట్టినందుకు...."

"రామచంద్రరావుగారు, నాదొక్క ప్రార్థన."

"అంత పెద్ద మాట నాతో ఎందుకులే- దాన్ని దైవం కోసం రిజర్వు చేసుకో. నీ కోరిక ఏమిటో చెప్పు?"

"ఏమీలేదు. మీరు - కనీసం నాకోసమన్నా- సన్నటి తేలిక పుస్తకాలు చదవండి."

"విషయం బరువుగా వుంటే - ఫరవాలేదుగా?"

"కాగితం తేలికగా వుంటే చాలు.... ఇప్పట్లో మళ్ళీ మాకు మోత బరువు ఉండదుగా!"

"ఉండదనే అనుకుందాం..."

"రక్షించారు" అని అంటూ అతను వెళ్ళిపోయాడు.

"మళ్ళీ ఏదో చెత్త పుస్తకం వచ్చిందే" అంటూ ఒక కంఠం హేళనగా పలుకరించింది.

రామచంద్రయ్యగారు ఆ మనిషి వంక శాంతంగా చూశారు... ఎమ్మెల్యే పంచ - అత్త కోడలు అంచు ఉత్తరీయం... సినిమాలో విలన్‌కి సహాయంగా ఉండే గూండా ముఖం... ఆ నడికారు మనిషిని చూస్తూ,

"రా సదాశివం! కాగితం మంచిది కాకపోయినా - విషయం మంచిది. తీరిక ఉన్నప్పుడు ఒకసారి నువ్వుకూడా యీ అగ్ని పురాణం చదువు."

"నాలుగు చెత్త కాగితాలు - రెండు మూడు పిడకలు - బుడ్డెడు కిరసనాయిలు - రెండు అగ్గిపుల్లలు - అంతా అగ్గే - దానికింత రాద్ధాంతం. ఒక పెద్ద పుస్తకం - పైగా దానికి అగ్ని పురాణం అని పేరు. మీ ఋషులు ఉన్నారే...'

"వాళ్ళు అమాయకులు. మనకున్నంత తెలివితేటలు వాళ్ళకు లేవు."

"పోనీలే - ఇల్లంతా యీ పుస్తకాలు చేర్చడం మంచిదే. దహనానికి కట్టెలు కొనక్కర్లేదు. ఈ చదువంతా నీతోనే స్వర్గానికి తీసుకువెళ్ళొచ్చు."

రామచంద్రయ్యగారు ఒక్క క్షణం అతని వంక జాలిగా చూశారు....

"ఈ స్థలం ప్లాట్లు కట్టి అమ్మతారా - మీకు రెండు ప్లాట్సు ఊరికే యిస్తాము అంటూ జనం వస్తున్నారు... మీరు మా మాట వినరు. మమ్మల్ని బాగుపడనివ్వరు" అంటూ సదాశివం విసుక్కుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

రామచంద్రయ్యగారు "సుశీలా!" అంటూ పిలిచాడు.

ఆవిడ వచ్చింది - ఏమిటన్నట్టుగా చిరాకుగా చూసింది.

"మీ ఆయనకు లక్ష్మి కటాక్షం వుంది - కాని సరస్వతీ ప్రసన్నం లేదు... ఈ గ్రంథాలని నాశనం చేస్తాడేమోనని భయంగా వుంది. వీటిని నువ్వే కాపాడాలి.'

"పోయిన తరువాత ఏం జరిగితే ఏమిటి?"

"మానవుడు మరణిస్తాడు. మానవ జాతి మరణించదు. రచయిత, కవి నశించుతారు. కావ్యాలు, రచనలు నశించకూడదని ముందు తరాలవారి మనుగడకి యివి చాల అవుసరం."

"మన తరం యిలా అఘోరించింది. ముందు తరం సంగతి మీకెందుకు?' అంటూ ఆవిడ విసవిసా అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

కాలం పరుగెత్తింది...

ఆనాడు వైకుంఠ ఏకాదశి.... ఆలయా లన్నింటిలోను కోలాహలంగా వుంది.

రామచంద్రయ్యగారి దగ్గర అరవింద కూర్చొని వుంది. రెండు రోజులుగా ఇల్లంతా హడావిడిగా వుంది.

లాయర్లు, డాక్టర్లు వస్తున్నారు.

"మీరేం ఖంగారు పడకండి - ఆయన ఆరోగ్యానికేం లోపం లేదు" అని డాక్టరు సుందరరామయ్యగారు అని అంటూంటె-

"ఏదైనా మందు" అంటూ అరవింద అంటూంటె.... ఆయన నవ్వి, "రోగం ఉన్నవాడికి ఔషధం" అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

"ఏమిటో - ఎందుకు చెప్పాడో, మనస్సు మార్చుకునే లోపలే మీ పనులు పూర్తిచేసుకోండి" అంటూ లాయర్లు సలహాలు చెప్పారు....

ఈ కార్యక్రమానికి నాంది నవమినాడు జరిగింది.

రామచంద్రయ్యగారి పిలుపు విని యింట్లో అంతా ఆయన పర్ణశాలలోకి చేరారు.

సదాశివం రుస రుసలాడుతూ "ఏం మునిగింది?" అని గద్దించాడు.

"ప్రస్తుతానికేం మునగలేదు... కోపతాపాలు మాని నేను చెప్పింది జాగర్తగా వినండి - మధ్యలో అడ్డు రావద్దు - నాతో ఏదైనా పనివుంటె రెండు రోజుల్లో చేయించుకోండి."

"చేయించుకోకపోతే?"

"నావల్ల మీరే సహాయం పొందలేరు...."

ఆయన చెప్పిన తీరు, ఆయన వాలకం చూస్తే - వాళ్ళెవరు మామూలు పద్ధతిలో వేళాకోళాలు చెయ్యలేదు. ఈసడించుకోలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అందురు వెళ్ళిపోగా అరవింద ఒక్కర్తే అక్కడ మిగిలింది.

"రెండు రోజులు తరువాత ఏం జరుగుతుంది" అని అడుగుతుంది.

"వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయి" అని అన్నాడు.

"అంటె?"

"నలుగురు మోయవలసిన దాన్ని, యిన్ని రోజులు నేనొక్కడినే మోస్తున్నా. ఇహ మోయవలసిన అవుసరం ఉండదు."

"నాకు అర్థమైయ్యేలా చెప్పు."

"అది వున్న చోట అంతం ఉండక తప్పదు" అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

"అమ్మా" అంటూ బిగ్గరగా పిలిచింది.

"ఏం తల్లి?" ఆవిడ దగ్గరకు వచ్చింది.

"నేనొక మాట అడుగుతాను నిజం చెబుతావా?"

"నీ బోడి ప్రశ్నలకు అబద్ధం చెప్పవలసిన కర్మ నాకేం పట్టింది?" అంటూ ఎదురు ప్రశ్న వచ్చింది.

"ఇంత మంచిగా వుండే తాతయ్యని మీరంతా ఎప్పుడూ ఎందుకు తిడుతూ వుంటారు?"

"వూళ్ళో వాళ్ళ ఆస్తులన్నీ కాజేసిన వాడిని - తిట్టక పూజ చేస్తారా?"

"తాతయ్య అల్లాంటి వాడు కాదమ్మా. అందరికి దాన ధర్మాలు చేస్తాడే గాని - ఎవ్వరి వస్తువులు తీసుకున్నట్టు కనిపించలేదు."

"తేరగా వస్తే - ఎన్ని దావాలైనా వెయ్యవచ్చు - అయినా చిన్న పిల్లవి నీకు యీ అనవసరమైన విషయాలు ఎందుకు? వెళ్ళి చదువుకో!"

బయటకు వెళ్ళిన రామచంద్రయ్యగారి వెంట - కాషాయ బట్టలు కట్టుకున్న నలుగురు వ్యక్తులు వచ్చారు.

ఆ పర్ణశాలలోని గ్రంథాలన్నీ జాగ్రత్తగా అట్టపెట్టెలలో పెట్టి వాటిని తమ వ్యానులో పెట్టుకున్నారు.

"చాలా అమూల్యమైన గ్రంథాలు సేకరించిన మీకు మానవ సమాజం చాలా ఋణపడివుంది. ఎందరో భక్తులకి నిరంతరం మోక్ష దర్శకులు అవుతాయి" అంటూ కృతజ్ఞతలు తెలియపరుచుకున్నారు.

ఎంతో సంతృప్తి ఆయన ముఖంలో కనిపిస్తోంది....

మెడికల్ కాలేజి నుంచి వచ్చిన వాళ్ళతో మాట్లాడి, కాగితాలేవో సంతకాలు పెట్టి యిచ్చేశాడు....

అన్ని పుస్తకాలు దానం చెయ్యగా మిగిలిన ఒకే ఒక గ్రంథం - విష్ణు సహస్రనామాలు చదువుకుంటూ కూర్చున్నాడు.

వైకుంఠ ఏకాదశి - పగలు గడిచింది... అర్ధరాత్రి ఘడియలు వచ్చాయి. పుస్తకం ముడిచి దేముడి పటం ముందు పెట్టాడు.

పర్ణశాల నుంచి బయటకు వచ్చి - నలుదిక్కులా ఒక్కసారి కలయ జూచాడు... ఆకాశాన్ని అంటే మేడ. ధనవంతుల యిల్లు అని తెలియపరిచే సాధన సంపత్తి - నౌకర్లు చాకర్లు....

ఒక చిరుచాప, దిండు తీసుకుని పశువుల శాల వైపు నడిచాడు. ఉత్తర దిక్కుగా తల పెట్టుకుని - చాప మీద పడుకున్నాడు.

"అంపశయ్యమీద భీష్ములవారా?" అంటూ సదాశివం హేళన చేస్తూంటె- ఆయన చెయ్యెత్తి దీవిస్తూ వుంటె - దృష్టి శ్రీ చరణాలమీద నిలచింది.

హంస లేచి పోయింది.

సంతాప సభలో మాట్లాడుతూ - ఆ యింటి లాయరు వెంకటప్పయ్యగారు "రామచంద్రయ్యగారు లాంటి వ్యక్తులు - నూటికో కోటికో ఒక్కరుంటారు. ఈ కలికాలంలో కూడా యిటువంటి వ్యక్తులు భూమిమీద వుంటారు అంటె - ముందు తరం వాళ్ళకి నమ్మశక్యం కాదు.

"చిన్ననాటి స్నేహితులు కష్టాలలో వుంటె, సహాయం చేసే వ్యక్తులు మనకు అక్కడ, అక్కడ కనిపిస్తూ వుంటారు. కాని, స్నేహం కోసం... అందులోను యీ భూమి పైన లేని స్నేహితుడికోసం - తమ సర్వస్వాన్ని అర్పణ చేసిన వారు చాలా అరుదు.

"నడివయస్సులో ఉన్న తనకు భార్య పోయింది. సంతానం లేదు. ఆ దుఃఖాన్ని సదాశివుడు కాలకూట విషం మ్రింగినట్లుగా తనలో దాచుకున్నాడు.

"వ్యాపారంలో - దివాళా తీసిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి- ఇరవై సంవత్సరాలుగా - ఆ అప్పులన్నీ తీర్చి ఆ కుటుంబాన్ని ఒక దోవలోకి తీసుకువచ్చాడు.

"స్నేహితుడికి యిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ యిరవై సంవత్సరాల కాలంలో - యీ విధి నిర్వహణలో ఎందరో ఆయన్ను అపార్థం చేసుకున్నారు. తూలనాడారు. అవమానాలు చేశారు. 'మీ ఆస్తిమీద ఆయన పెత్తనం ఏమిటి?' అని రెచ్చకొట్టారు.

"ఆయన అన్నీ సహించారు. తను అన్నమాట నిలబెట్టుకున్నాడు. స్నేహితుడి ఆస్తి, వ్యాపారం - పూర్వ వైభవానికి తీసుకు వచ్చి అతని కొడుక్కి అప్పచెప్పాడు.

"అంతకన్నా ఎక్కువైన విషయం, తన స్వార్జితం దాదాపు పాతిక లక్షలు విలువ చేసే ఆస్తి - తన స్నేహితుడి కొడుకుకి, కోడలికి పూర్తి హక్కులతో యిచ్చాడు.

"వ్యాపారస్థుడుగా బ్రతికినా - వేదాంతిగా జీవించిన రామచంద్రయ్యగారు తను సేకరించిన అమూల్య గ్రంథాలని - మన అందరి కోసం - తన స్నేహితుడి జ్ఞాపకార్థం రామకృష్ణా మిషన్ లైబ్రరీకి దానం చేశారు.

"ప్రాణమున్నప్పుడే కాదు, ప్రాణం పోయిన తరువాత కూడా ఇతరులకి ఉపయోగపడాలనే సదుద్దేశ్యంతో తన శరీరాన్ని మెడికల్ కాలేజికి దానం చేశారు.

"ఆయన ఆత్మకు శాంతి కలగాలని నేను భగవంతుడిని ప్రార్థించను - ఎందుకంటే ఆయన ఎప్పుడూ శాంత మూర్తే!

"మన అందరికి - సద్ బుద్ధి - సద్గతి కలిగేలాగా మన అందరిని - ఎల్లవేళలా ఆ కైవల్య పదం నుంచి రామచంద్రయ్యగారు మన అందరిని - ఆశీర్వదించమని- ఆ సర్వేశ్వరుడిని ప్రార్థించుదాం"

ఆకాశం వంక తిరిగి - సదాశివం దంపతులు నమస్కారం చేస్తున్నారు.

"నాకు తెలుసు. నువ్వు చెడ్డవాడివి కాదు తాతయ్యా..." అనుకుంటూంటే- అరవింద మనస్సులో ఆనంద లహరి వెల్లివిరిసింది.